క్లుప్తంగా

వైభవంగా కామాక్షితాయి కల్యాణం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదిదంపతులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కామాక్షితాయి ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యనాయుడు, ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రక్తదాన శిబిరం



వెంకటాచలం: స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ ట్రస్టీ ఐ దీపావెంకట్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సెయింట్ జ్యూడ్స్ మానసిక దివ్యాంగుల కేంద్రంలోని చిన్నారులకు అన్నదానం చేశారు. ట్రస్ట్ కోఆర్డినేటర్ జనార్దన్‌రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నదానం



కోవూరు: చిలుక ద్వాదశిని పురస్కరించుకుని పడుగుపాడులోని షిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి అన్నప్రసాద వితరణను ప్రారంభించి మాట్లాడారు. గత కొన్నేళ్లుగా దాతలు రామిరెడ్డి భాను ప్రకాష్‌రెడ్డి, పద్మావతి దంపతులు అన్నదానం చేస్తుండడం అభినందనీయమన్నారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీఖరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తిరుపాల్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

కోవూరు : స్థానిక సచివాలయం-3 ప్రాంతంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ నిరంజన్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆరోగ్యపర్యవేక్షకులు ఇలియాజ్, ఏఎన్‌ఎం పుష్పలత, చంద్రకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ తనిఖీలు

మనుబోలు: పదోతరగతి విద్యార్థినులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ శేషాద్రివాసు అన్నారు. మనుబోలులోని బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా బోధనపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థినుల వర్క్‌బుక్‌లను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఎస్‌ఏ-1కు సిలబస్ పూర్తి చేశా రా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్‌ఎం వసంతకుమారి ఉన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి బలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విద్యుదాఘాతానికి వ్యక్తి బలైన ఘటన మండలంలోని పెనుబల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో విద్యుత్‌తీగ కిందకి వేలాడుతుండగా గ్రామ తలారి బత్తల మస్తానయ్య పక్కకు తొలగించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగ మస్తానయ్యకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.

వైస్ ఎంపీపీకి మాతృ వియోగం

వెంకటాచలం: మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి తల్లి రమణమ్మ(89) శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. సర్వేపల్లిలోని స్వగృహంలో ఉంచిన రమణమ్మ పార్థీవదేహాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

క్రీడాకారులకు అభినందన



కొడవలూరు: గండవరం ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను హెచ్‌ఎం శ్రీనివాసరావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 రగ్బీ పోటీల్లో జిల్లా జట్టు మూడో స్థానం దక్కించుకుందని తెలిపారు. గండవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు జితేంద్ర, నాయబ్‌రసూల్, మొహుద్దీన్, నిషాంత్, జోయల్, సాయి సత్తా చాటి జిల్లా జట్టును తృతీయ స్థానంలో నిలి పారని కొనియాడారు. అనంతరం నగదు ప్రో త్సాహకాలు అందజేశారు. పీడీ శివనాగబాబు, కోచ్ వంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



ముత్తుకూరు: దొరువులపాళెంలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాల కూడిన బోర్డు ఆవిష్కరణ



పొదలకూరు: కనుపర్తి సచివాలయంలో...



కోవూరు మండలం చెర్లోపాళెంలో...



బుచ్చిరెడ్డిపాళెంరూరల్: జొన్నవాడలో...



తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరులో..



వెంకటాచలం: చవటపాళెంలో..



కొడవలూరు మండలం ఆలూరుపాడులో...



విడవలూరు మండలం ముదివర్తిలో..



ఇందుకూరుపేట: కొరుటూరులో పార్టీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

వెంకటాచలం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య పేర్కొన్నారు. మండలంలోని చవటపాళెంలో శుక్రవారం నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి జగనన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జగనన్న పాలనలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. అనంతరం పార్టీకి సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

తోటపల్లిగూడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. చిన్నచెరుకూరు సచివాలయం పరిధిలో నిర్వహించిన 'ఏపీకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జనరంజక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలను తీసుకురావడమే కాకుండా గడప గడపకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన బుక్‌లెట్లను వలంటీర్లకు అందజేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు, పార్టీ నాయకులు కోడూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఈటీపీఆర్డీ నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ సుధీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తోందని మండల సచివాలయ కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ అన్నారు. మండలంలోని దొరువులపాళెం సచివాలయంలో సర్పంచ్ సునందమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయం పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ బందెల వెంకటరమణయ్య, ఎంపీటీసీ సభ్యులు దారా శోభ, ఎంపీడీఓ లక్ష్మణ కుమార్, నాయకులు గోపాలరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పొదలకూరు : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని వైస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనుపర్తి సచివాలయంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌మార్‌రెడ్డితో కలసి సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని ప్రభుత్వం రెండు కళ్లుగా భావిస్తోందని చెప్పారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సీఎంతో చర్చించి కరువు మండలాలను ప్రకటించడంతో పాటు వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. కరువు కోరల్లో చిక్కుకున్న ఏ ఒక్కరైతును వదలకుండా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. ఎంపీడీఓ నగేష్‌కుమారి, సర్పంచ్ అట్లా వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు నీలం లక్ష్మీప్రసన్న, సూరి అంకయ్య, చిన మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

కొడవలూరు: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఎంపీపీ జీ జ్యోతి పిలుపునిచ్చారు. మండలంలోని ఆలూరుపాడులో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ 33 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారని వివరించారు. అనంతరం గ్రామానికి అందించిన రూ.12.84 లక్షల సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. సర్పంచ్ మోచర్ల రమేష్, ఎంపీటీసీ ఎం కామేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కారెంపూడి సుబ్బరామిరెడ్డి, బాలభాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఈఓపీఆర్డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, వీఆర్వో ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విడవలూరు: మండలంలోని ముదివర్తిలో వైఎస్సార్‌సీపీ నేత కొండూరు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. ఎంపీటీసీ కాయల సౌందర్య, నాయకులు కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం

ఇందుకూరుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ కొనియాడారు. మండలంలోని కొరుటూరులో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ బీవీ రమణయ్య, నాయకులు షేక్ షబ్బీర్, పామంజి శ్రీనివాసులు, శ్రీహరికోట ప్రసాద్, తిరుమలరావు పాల్గొన్నారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ సచివాలయంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. పార్టీ జెండాను ఎగురవేసి సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు మురళి, సాగర్, బాలకృష్ణ, వినోద్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. మండలంలోని చెర్లోపాళెంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకు సంక్షేమ పథకాలు అందేవని తెలిపారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ టీ పార్వతి, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా కుల గణన

మనుబోలు: కుల గణనను పారదర్శకంగా చేపట్టాలని నోడల్ ఆఫీసర్, ఏపీఓ వనజాక్షి సూచించారు. మండలంలోని జట్లకొండూరు గ్రామంలో కుల గణనపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27 నుంచి మూడ్రోజుల పాటు కుల గణన చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక యాప్ ద్వారా 34 అంశాలకు సంబంధించిన వివరాలు సేకరించి నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సర్వేలో ప్రజలు తెలియజేసిన వివరాలను నమోదు చేసుకుని వారు ధ్రువీకరించాకే అప్‌లోడ్ చేయాలని సూచించారు.

రికార్డులను పక్కాగా నిర్వహించాలి

కోవూరు : సొసైటీల లావాదేవీలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని డీసీఏ తిరుపతయ్య సొసైటీల సీఈఓలకు సూచించారు. స్థానిక శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సొసైటీ కార్యాలయంలో కోవూరు సహకార బ్యాంకు పరిధిలోని సొసైటీల కార్యదర్శులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సొసైటీల్లో ప్రతినెలా ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సొసైటీ సీఈఓలు ఎప్పటికప్పుడు రికార్డులను పక్కాగా ఉంచుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్లు రమేష్, మల్లికార్జున, సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్, పడుగుపాడు సహకార సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను త్వరగా పూర్తి చేయండి



మనుబోలు: ఓటర్ల జాబితా రూపకల్పనను త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ కలెక్టర్ ఓబులేసు సిబ్బందికి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా రూపకల్పనపై సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్షించారు. మనుబోలు మండలంలో ఫారం-6 కింద 212, ఫారం-7 కింద 221, ఫారం-8 కింద 245, అడ్రస్‌ల మార్పు కోరుతూ 225 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మృతిచెందిన వారి ఓట్లను గుర్తించి తొలగించాలన్నారు. కొత్త ఓటు నమోదుకు డిసెంబర్ 9వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శివకృష్ణయ్య ఉన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



బుచ్చిరెడ్డిపాళెం: చిన్నారులకు బాండ్లు అందజేసిన ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన బాధిత చిన్నారులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేయూతనందించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రసన్న తల్లి,తండ్రి కోల్పోయిన పలువురు చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 11 మంది చిన్నారులకు రూ.20 వేల చొప్పున మొత్తం రూ.2.20లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేయించారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో చిన్నారులకు డిపాజిట్ బాండ్లు అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



విడవలూరు: సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

విడవలూరు: మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం చేయూతనందించారు. గ్రామానికి చెందిన సర్వేపల్లి కార్తీక్, బండ్ల కళ్యాణ్‌కుమార్ గత జూన్‌లో రామతీర్థం రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సముద్రస్నానం చేస్తూ ప్రమాదవశాత్తు అలల్లో చిక్కుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలకు తమ వంతు సాయం చేయాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు సీఎం సహాయ నిధి నుంచి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున చెక్కులు మంజూరు చేయగా తల్లిదండ్రులకు అందజేశామని వివరించారు. అలాగే బాధిత కుటుంబాలకు తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల చొప్పున అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, తిక్కవరపు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిక్షాను ఢీకొన్న ఆటో

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: నగర పంచాయతీ పరిధిలోని సెయింట్‌మేరీస్ విద్యాసంస్థల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. వివరాలు..రేబాలకు చెందిన ఓ కుటుంబం రిక్షాలో వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రిక్షాలో ఉన్న భార్య, భర్త, చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ముందు కూర్చున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

దాతల సహకారం ప్రశంసనీయం



దాతను అభినందిస్తున్న డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి

కొడవలూరు: యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి కొనియాడారు. యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు సైకిల్ స్టాండ్, బాలుర మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఈఓ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వగ్రామంలోని పాఠశాలలో అన్ని వసతులు ఉండాలని భావించి బండ్ల బంగారయ్య, కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బండ్ల హరిబాబు, రమాదేవి దంపతులు రూ.8 లక్షలతో సైకిల్‌స్టాండ్, బాలుర మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను సన్మానించారు. ఎంఈఓ-1,2 జీ వసంతకుమారి, అంకయ్య, హెచ్‌ఎం మోహనరామలింగయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ అహ్మద్, సర్పంచ్ కృష్ణమ్మ, పూర్వ విద్యార్థులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మోహన్ పాల్గొన్నారు.

వర్షాధార పంటల సాగును ప్రోత్సహించాలి



పొదలకూరులో మాట్లాడుతున్న ఏఓ వాసు



ముత్తుకూరు: మాట్లాడుతున్న దొరసానమ్మ



కొడవలూరు: గండవరంలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ సుజాత



విడవలూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఇందుకూరుపేట: నాట్లను పరిశీలిస్తున్న ఏడీ రాజ్‌కుమార్

పొదలకూరు : రబీలో వర్షపాతం తక్కువగా ఉన్నందున రైతులు వర్షాధార పంటలను సాగు చేసుకునేలా ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారి ఏ వాసు వీఏఏలు, వీహెచ్‌ఏలకు సూచించారు. మండలంలోని మర్రిపల్లి ఆర్‌బీకేలో వీఏఏలు, వీహెచ్‌ఏలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కాలువలు, బోర్ల ద్వారా సాగులోకి రాని విస్తీర్ణాన్ని గుర్తించి వర్షాధార పంటలైన పెసర, నువ్వు పంటలను సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాలు ఆగిన వెంటనే పెసర, నువ్వు పంటలను విత్తుకునేలా చూడాలన్నారు. రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సదస్సులో ఏఎస్‌ఓ రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

ముత్తుకూరు: వరి పంటకు అధిక మోతాదులో రసాయన ఎరువులను వినియోగించవద్దని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ దొరసానమ్మ సూచించారు. మండలంలోని మల్లూరు, తాళ్లపూడి రైతుభరోసా కేంద్రాల్లో 'నేల ఆరోగ్యం-సంరక్షణ' అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్ష ఫలితాల ద్వారా భూముల భౌతిక, రసాయన లక్షణాలను విశ్లేషించవచ్చని తెలిపారు. భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువులను అధికంగా వినియోగిస్తే నేల స్వభావం దెబ్బతింటుందన్నారు. సాగునీరు పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఆత్మ డీపీడీ శివన్నారాయణ మాట్లాడుతూ సాగునీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. మట్టి నమూనా కార్డుల అవసరాన్ని వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓలు శ్రీనివాసచక్రవర్తి, గీతామాధురి, ఏఓ జోత్స్నారాణి, ఏఏబీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సర్పంచ్ కాకి మస్తానమ్మ, ఉపసర్పంచ్ గోపాల్, వ్యవసాయ సహాయకులు శ్రీనివాసులు, చందన పాల్గొన్నారు.

స్వల్పకాలిక వరి రకాలతో సాగునీరు ఆదా

కొడవలూరు: స్వల్ప కాలిక వరి రకాలను సాగు చేసుకోవడం ద్వారా సాగు నీటిని ఆదా చేయవచ్చని ఏడీఏ డీ సుజాత తెలిపారు. మండలంలోని నాయుడుపాళెం, గండవరం, నార్తురాజుపాళెం ఆర్‌బీకేల్లో సాగునీటి యాజమాన్యంపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో స్వల్ప కాలిక వరి రకాలైన ఎన్‌ఎల్‌ఆర్ 34449, కేఎన్‌ఎం 1638, ఎన్‌ఎల్‌ఆర్ 3354, ఆర్‌ఎన్‌ఆర్ 15048 తదితర రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 15వ తేదీలోగా నాట్లు వేసుకుంటే పంట అనుకూలంగా ఉంటుందని చెప్పారు. డ్రమ్ సీడర్ లేదా వెదజల్లే పద్ధతులతో పది రోజుల ముందే పంట కోతకు వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి, ఇరిగేషన్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, వీఏఏలు టీ కవిత, కే శ్రావ్య, డీ శివజ్ఞాన, రైతు నాయకులు ఎం గిరిధర్‌రెడ్డి, ఎం నారసింహారెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి యాజమాన్యంపై అవగాహన

విడవలూరు: స్థానిక రైతుభరోసా కేంద్రంలో స్వల్ప కాలిక వరి వంగడాలు, సాగునీటి యాజమాన్యంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి పీవీ కృష్ణయ్య, ఇరిగేషన్ అధికారి పార్థసారథి, ఏఈఓ కిరణ్ పాల్గొన్నారు.

నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి

ఇందుకూరుపేట: నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని లేబూరులో నారుమడులు, వరి నాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. నారుమడుల్లో పురుగుల ఉద్ధృతి, సుడిదోమ తీవ్రతను గమనించి నివారణ చర్యలు సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు నాట్లు వేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు సుమలత, దీక్షిత, తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దామోదర కల్యాణం



ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తులసీ దామోదర కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కోవూరు: చిలుక ద్వాదశిని పురస్కరించుకుని కోవూరులోని కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో తులసీదామోదర కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనాథం సుబ్బరామయ్య ఉసిరి చెట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై కామాక్షి సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ బీ సురేష్, ధర్మకర్తలు ఏ హనుమారెడ్డి, పీ మోహన్ పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో..

స్థానిక వీరాంజనేయస్వామి దేవస్థానంలోని కృష్ణ మందిరంలో ప్రధానార్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారిసేన భక్త బృందం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్యస్వామి, జయప్రకాష్‌స్వామి, నందకుమార్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.